# మళ్లీ గ్రూప్-1 మెయిన్స్ నిర్వహించాలి

- రెండు రాష్ట్రాల సర్వీస్ కమిషన్‌లకు సుప్రీం ఆదేశం
- 2011 సిలబస్ ప్రకారమే పరీక్షల నిర్వహణ
- మూడు నెలల్లో ప్రక్రియ ముగించాలని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ:

ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు 2011లో నిర్వహించిన గ్రూప్ - 1 మెయిన్స్ పరీక్షలను మళ్లీ నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు వేర్వేరుగా ఈ పరీక్ష నిర్వహించాలని ఇచ్చిన తీర్పులో తెలిపింది. 2011 నోటిఫికేషన్ ప్రకారం పాత సిలబస్ ప్రకారమే ఈ పరీక్షను నిర్వహించాలని కూడా స్పష్టంచేసింది. 2011నాటి మెయిన్స్ పరీక్షల్లో అర్హతను పొంది ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులు కూడా ఈ పరీక్షలకు హాజరుకావాల్సిందేనని జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే, జస్టిస్ జాస్తి చలమేశ్వర్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తెలిపింది. 2011లో గ్రూప్ - 1 పరీక్షల నిర్వహణపై దాఖలైన పలు పిటిషన్లు సుదీర్ఘంగా విచారించిన సర్వోన్నత న్యాయస్థానం బుధవారం తుది తీర్పు చెప్పింది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు 312 గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం 2011లో నాటి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నోటిఫికేషన్ జారీచేసింది. సుమారు 1.70 లక్షల మంది అభ్యర్థులు ప్రిలిమ్స్ పరీక్షలకు హాజరుకాగా 16,782 మంది మెయిన్స్ పరీక్షలకు అర్హత పొందారు. 606 మంది అభ్యర్థులు 2013లో ఇంటర్వ్యూలకు కూడా హాజరయ్యారు. అయితే అప్పుడే ప్రిలిమ్స్ ప్రశ్నాపత్రంలో ఆరు ప్రశ్నల్లో తప్పులు దొర్లాయని కొద్ది మంది అభ్యర్థులు అప్పటి హైకోర్టును ఆశ్రయించారు. ఈ ప్రశ్నాపత్రాలను పరిశీలించాలని యూపీఎస్సీని హైకోర్టును ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలపై ఏపీపీఎస్సీ.. సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీన్ని విచారించిన సుప్రీంకోర్టు.. మెయిన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులకు మళ్లీ పరీక్షలు నిర్వహించాలని అప్పట్లోనే ఆదేశాలు జారీచేసింది. కానీ ఈ ఆదేశాలను తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు అమలుచేయలేదని, శ్రీనివాస్ అనే అభ్యర్థి సుప్రీంలో పిటిషన్ దాఖలుచేయగా, శైలజ, కోటేశ్వరరావు అనే మరో ఇద్దరు ఇంప్లీడ్ అయ్యారు. ఈ పిటిషన్లన్నింటిని సుప్రీంకోర్టు విచారించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విడివిడిగా పాలన సాగిస్తున్నందున రెండు రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు వేర్వేరుగా పాత సిలబస్ ఆధారంగానే పరీక్షలు నిర్వహించాలన్నది. మూడు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తిచేయాలని పేర్కొంది. మెయిన్స్ పరీక్షలకు అర్హత సాధించిన విద్యార్థులకు కూడా మళ్లీ మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని ధర్మాసనం స్పష్టంచేసింది. ఉమ్మడి రాష్ట్రంలో ఒకే పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉండేదని, ఇప్పుడు వేర్వేరు కమిషన్లు ఉన్నందున.. మళ్లీ ఉమ్మడి సర్వీస్ కమిషన్ ఏర్పాటు అసాధ్యమని స్పష్టంచేసింది.